సాక్షి సిద్దిపేట

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



**తెగులు.. దిగులు**

వరి చేలకు మొగిపురుగు సోకి ఎర్రబడుతు న్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు 8లో ▸



**ఖాళీ జాగా.. పాగా!**

సంగారెడ్డి పట్టణంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్రమార్కులు పాగా వేస్తున్నారు.

వివరాలు 8లో ▸



**ఇంటి నంబర్ ఇక్కట్లు**

సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకున్నా అధికారులు ఇంటి నంబర్ కేటాయించక పోవడంతో పేదలు అవస్థలు పడుతున్నారు.

వివరాలు 9లో ▸

# స్వపక్షంలో విపక్షం!

**సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై పలువురు కౌన్సిలర్ల అసమ్మతి**

సిద్దిపేట పురపాలక సంఘం పాలకవర్గంలోని స్వపక్ష సభ్యులు పలువురు విపక్షంగా నిలుస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఇటీవల సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సైతం వ్యతిరేకించారు. అంతకంటే ముందు మున్సిపల్ కమిషనర్‌ను నలుగురు కౌన్సిలర్లు కలిసి తమ వార్డుకు సంబంధించిన అంశాలను ఎజెండాలో చేర్చాలని వినతి పత్రం అందించారు.

– సాక్షి, సిద్దిపేట



సిద్దిపేట మున్సిపాలిటీలోని 43 వార్డుల్లో 2021లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి 35 మంది, ఇండిపెండెంట్లు ఆరుగురు, బీజేపీ, ఎంఐఎంల నుంచి ఒక్కొక్క కౌన్సిలర్ గెలుపొందారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక దృష్టితో పట్టణాన్ని అభివృద్ధి చేయడంతో బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. మే 7, 2021న మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కడవేర్గు మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇండిపెండెంట్లుగా గెలుపొందిన ఆరుగురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లోనే చేరారు. దీంతో ఆపార్టీ బలం 41కి చేరింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల వరకు సాఫీగానే కొనసాగింది. జనవరి 19న తమ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఎజెండా అంశాలు చైర్‌పర్సన్‌కు చెప్పే అవకాశం ఉన్నప్పటికీ ఇటీవల నలుగురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

**ఏకపక్ష నిర్ణయాలపైన..**

ప్రతీ నెల జరిగే మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాల్లో ఏకపక్ష నిర్ణయాలను పలువురు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా ఒక వ్యక్తి భూమి కోల్పోయాడని, వారికి మరొక దగ్గర స్థలం ఇప్పించాలని, కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూంలకు నిర్వహణ నిధులు కేటాయించాలని.. ఇలా పలు నిర్ణయాలను పలువురు కౌన్సిలర్లు వ్యతిరేకించారు.

**పలువురు పార్టీ మారే అవకాశం**

సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ తీసుకుంటున్న నిర్ణయాలను పలువురు కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలు ఇలానే కొనసాగితే పార్టీ మారేందుకు సైతం వెనుకాడం అంటున్నారు. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 6వ తేదీన నిర్వహించే కాంగ్రెస్ పట్టణ కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రానున్నారు. ఈసందర్భంగా పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది. అలాగే సీఎం రేవంత్‌రెడ్డిని ఇటీవల సిద్దిపేటకు చెందిన పలువురు కౌన్సిలర్లు కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితో వెళ్లినట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం గురించి చర్చించినట్లు సమాచారం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, తదితరులు

## కార్యాచరణతో ముందుకు సాగాలి

సిద్దిపేటరూరల్: పంచాయతీలకు నూతనంగా నియమితులైన ప్రత్యేకాధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి ములుగు కలెక్టరేట్ నుంచి మంత్రి సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మిషన్ భగీరథ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వేసవిలో తాగునీటి ప్రణాళికలు, ప్రత్యేక పాలన, శానిటేషన్, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, డీపీఓ దేవకీదేవి, జెడ్పీ సీఈఓ రమేశ్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్‌ఈ శ్రీనివాస్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు తప్పనిసరి

సిద్దిపేటజోన్: తూకం విషయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రైతుబజార్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కూరగాయలు విక్రయించే రైతుల తూకం యంత్రాలను పరిశీలించారు. ప్రతి కొనుగోలు దారుడు తూకం వేసిన తర్వాత వాటిని సరి చూసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా రైతులు తప్పనిసరిగా తూకం చేసి కూరగాయలు విక్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ అధికారి నాగరాజు, రైతు బజార్ ఇన్‌చార్జి ప్రభాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

## న్యూస్‌రీల్

### నేడు మల్లన్న మూడో వారం



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నేడు మూడో ఆదివారం భక్తులు భారీగా తరలిరానున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే సత్తేటి వారాల్లో మూడోవారం కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు మల్లన్నకు పట్నం వేసి బోనం సమర్పిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### 12న జిల్లాస్థాయి పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 12వ తేదీన జిల్లాస్థాయి సైన్స్ పోటీలు టీటీసీ భవన్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సుస్థిర భవిష్యత్ కోసం విజ్ఞాన శాస్త్రం' అనే ప్రధాన అంశంతో పాటు మరో 7 ఉప అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చిత్రలేఖనం, కవిత్వం, పాటలు, ఉపన్యాసం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి ముగ్గురు చొప్పున విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849699382 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లో ఏఐటీయూసీ కార్యదర్శి కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రం నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వారికి రక్షణ లేకుండా చేసిందని వాపోయారు. ఉపాధి హామీ కార్మికుల పొట్టగొట్టే విధంగా ఆధార్ కార్డును అనుసంధానం చేస్తూ శాటిలైట్ ప్రయోగం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో రాజు, పోచయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలి'



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గంలో దళిత బంధు స్కీం పేరిట వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని.. ఇందుకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన అనుచరులను ఉపయోగించుకొని 4 మండలాల పరిధిలో సుమారు 144 మంది దళితుల నుంచి రూ. లక్ష నుంచి రెండు లక్షల చొప్పున దాదాపు రెండు కోట్ల రూపాయలకు పైగా వసూలు చేశాడని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు ప్రభాకర్, వెంకట్‌మావో, శ్రీహరి, అరుణ్, ప్రశాంత్, మల్లేశం, చక్రపాణి, రమేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమలుపై దృష్టి పెట్టండి: వంటేరు



గజ్వేల్: బీఆర్‌ఎస్‌పై విమర్శలు మానుకొని ప్రజలకిచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టాలని అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హితవుపలికారు. శనివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందించాలన్నారు. రుణమాఫీకి సైతం చర్యలు చేపట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను దూషించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ కృషి వల్లే తెలంగాణ నేడు దేశానికే అన్నపూర్ణగా మారిందని గుర్తు చేశారు. ప్రజల పక్షాన ప్రభుత్వంపై హామీల అమలుకు బీఆర్‌ఎస్ ఒత్తిడి పెంచుతూనే ఉంటుందని పేర్కొన్నారు.

## 'ఆయిల్‌పామ్'తో అధిక లాభాలు

**జిల్లా ఉద్యానవన అధికారి సునీత**

కొండపాక(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సునీత పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొండపాక శివారులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను శనివారం పరిశీలించారు. సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? అధికారుల సలహాలు సూచనలు అందుతున్నాయా..? అని తోటలో పనిచేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలు సైతం సాగు చేసుకోవచ్చన్నారు. గింజలకు మార్కెట్లో అధిక ధర పలుకుతుందని తెలిపారు. రైతులకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా డ్రిప్, స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందజేస్తుందన్నారు. మూడు నెలలకోసారి ఎరువులను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రియదర్శిణి, ఆయిల్‌ఫెడ్ అధికారులు శంకర్, హరీశ్, రైతులు పాల్గొన్నారు.



తోటను పరిశీలిస్తున్న అధికారులు

## కేసుల్లో శిక్షల శాతం పెంచండి

**సీపీ అనురాధ**

సిద్దిపేటకమాన్: కేసుల్లో శిక్షల శాతం పెంచాలని, నిందితులకు శిక్ష పడేలా కోర్టు కానిస్టేబుళ్లు కీలకపాత్ర వహించాలని సీపీ అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ విధులు నిర్వహించే సిబ్బందితో శనివారం సీపీ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణతో పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తప్పనిసరి అన్నారు. పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచాలని, బాధితులకు న్యాయం జరగాలంటే కేసుల్లో నిందితులకు శిక్ష పడాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్ ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల ట్రయల్ సమయంలో సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికారులు తప్పకుండా మానిటర్ చేయాలని తెలిపారు. కోర్టు విధుల్లో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ రామరాజు, విఠల్, సంజీవ్, శ్రీనివాస్, సూరజ్, వెంకట్‌లకు సీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు, మెసేజ్‌లకు ఎవరూ స్పందించకూడదన్నారు. ఎవరికి వ్యక్తిగత, బ్యాంకు వివరాలు, ఓటీపీ వంటి వివరాలు తెలుపకూడదని చెప్పారు. సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన వెంటనే బాధితులు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న సీపీ అనురాధ

## శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

**డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి**

గజ్వేల్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మండల పరిధిలోని ప్రభుత్వ, కేజీబీవీ, మైనార్టీ, మోడల్ స్కూల్‌కు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షల పట్ల భయం పోగొట్టడంతో పాటు సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, తొలిమెట్టు, ఉన్నతి, ఎఫ్ఏఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎంఈఓ సునీత, జగదేవ్‌పూర్ ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, అకాడమిక్ సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, ఎంఎస్‌ఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

### గొర్రెల పంపిణీ చేపట్టాలి

**యాదవ మహాసభ నాయకుల డిమాండ్**

గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గొర్రెల పంపిణీ చేపట్టాలని యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కూచారం రవీందర్ యాదవ్, కురుమ సంఘం జిల్లా నాయకుడు కామల్ల అయిలయ్య డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో గొర్రెల యూనిట్లకు రూ. 30 కోట్లకుపైగా డీడీలు తీసి ఉన్నాయని తెలిపారు. గొర్రెలు పంపిణీ చేయని పక్షంలో గజ్వేల్ ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని పేర్కొన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు మల్లేశ్ యాదవ్, నూనె వెంకటేశ్ యాదవ్, బాబు యాదవ్, ప్రవీణ్ యాదవ్, వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేన్సర్‌పై అవగాహన అవసరం

**సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి**

సిద్దిపేటజోన్: బీడీ పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న మహిళలు రొమ్ము, గర్భాశయ కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం దేశాయి బీడీ కంపెనీలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బీడీ కార్మికులు కేన్సర్ రాకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా బీడీలు తయారీ చేసే సమయంలో మాస్కులు ధరించడంతో పాటు చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలన్నారు. బీడీలు తయారు చేసే సమయంలో పిల్లలు దూరంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు విజయేందర్‌రెడ్డి, భరోసా సీఐ దుర్గ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేష్, కంపెనీ ప్రతినిధులు దీపక్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

## 'సింగూరు'పై నజర్

- ప్రాజెక్టుపై రోడ్డు, లైట్ల మరమ్మతుకు సన్నాహాలు
- డ్యాం ఎగువన దెబ్బతిన్న కట్ట రివిట్‌మెంట్
- పనులకు రూ.16 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రాజెక్టును పరిశీలించిన నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్



సింగూరు డ్యాం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయకట్టుకు సాగు నీరందిస్తున్న సింగూరు ప్రాజెక్టు నిర్వహణపై నీటిపారుదల శాఖ ఎట్టకేలకు దృష్టి సారించింది. ఎనిమిదేళ్లుగా ఈ ప్రాజెక్టు నిర్వహణకు సక్రమంగా నిధులు రాకపోవడంతో డ్యాంపై రోడ్డు దెబ్బతిన్నది. పలుచోట్ల పిచ్చి మొక్కలు మొలిచాయి. అలాగే డ్యాంపై సరిగ్గా విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పర్యవేక్షణకు ఇబ్బందిగా మారింది. అక్కడక్కడ గేట్ల నుంచి కూడా చిన్న చిన్న లీకేజీలున్నాయి. ఈ పనులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు ప్రభుత్వం రూ.రెండు కోట్లు మంజూరు చేసినప్పటికీ.. టెక్నికల్ సాంక్షన్ రాలేదు. దీంతో ఈ పనులు చేపట్టలేక పోయారు. ఇప్పుడు ఈ ప్రతిపాదనలకు టెక్నికల్ సాంక్షన్ ఇవ్వాలని నీటిపారుదల శాఖ భావిస్తోంది. ప్రతిపాదించిన పనులను పరిశీలించేందుకు ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీదేవి, ఇతర ఉన్నతాధికారుల బృందం శనివారం డ్యాంను సందర్శించింది. చేపట్టాల్సిన మరమ్మతు పనుల గురించి తెలుసుకున్నారు. త్వరలోనే మరమ్మతు పనులకు టెక్నికల్ సాంక్షన్ ఇస్తారని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**దెబ్బతిన్న రివిట్‌మెంట్..**

గత వర్షాకాలంలో ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో డ్యాంకు ఎగువ వైపు కట్టకు రివిట్‌మెంట్ కొంత భాగం దెబ్బతిన్నది. దీన్ని కూడా మరమ్మతు చేయాలని నీటిపారుదలశాఖ భావిస్తోంది. తక్షణం ఈ రివిట్‌మెంట్‌ను సరిచేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో డ్యాం సేఫ్టీకి ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. పనులకు సుమారు రూ.16 కోట్లు అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నిధులను కూడా మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులు నిర్ణయించారు. ఈ అదనపు నిధులు కూడా మంజూరైతే ఈ రివిట్‌మెంట్ మరమ్మతు పనులు చేపట్టనున్నారు.

**నీళ్లు తక్కువగా ఉన్నప్పుడే..**

డ్యాంలో నీళ్లు లేనప్పుడే ఈ రివిట్‌మెంట్ మరమ్మత్తు పనులు చేసేందుకు వీలు కలుగుతుంది. డ్యాంలో ప్రస్తుతం నీటి మట్టం తక్కువగా ఉంది. ఎండలు ముదిరాక ఇంకాస్త నీటి మట్టం తగ్గితే పనులు చేసేందుకు వీలవుతుంది. ఏప్రిల్, మే నెలల్లో ఈ పనులు చేసేందుకు వీలు కలుగుతుంది. ఈ లోగా ఈ పనులకు నిధుల మంజూరు, టెక్నికల్ సాంక్షన్ ఇతర ప్రక్రియను పూర్తి చేసే యోచనలో నీటిపారుదలశాఖ అధికారులు ఉన్నారు.

## ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి





విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

**ప్రొఫెసర్ డాక్టర్ భవాని**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భవాని అన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ సునీతతో కలిసి ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా కృషి చేస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్న జేవీవీని అభినందించారు. ఇలాంటి పోటీలతో విద్యార్థులకు సైన్స్‌పట్ల మరింత ఆసక్తి కలుగుతుందన్నారు. అనంతరం జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా జరిగిన చెకుముకి సంబురాల్లో పాఠశాల స్థాయిలో 12,000 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. 2023–24 జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ బూర్గుపల్లి (గజ్వేల్), ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ ఐనాపూర్ (కొమురవెల్లి), తృతీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ దౌల్తాబాద్ పాఠశాలలు నిలిచాయని వివరించారు. ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానంలో టీఎస్‌ఎంఎస్ ఇర్కోడ్ (సిద్దిపేట), ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ ఇందిరానగర్ (సిద్దిపేట), తృతీయ స్థానంలో టీఎస్‌ఎంఎస్ దౌల్తాబాద్ పాఠశాలల విద్యార్థులు నిలిచారని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 9, 10, 11 తేదీల్లో జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్యం, కోశాధికారి సాదత్‌అలీ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజమౌళి, నర్సింగరావు, భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉద్యోగులను నిరాశపర్చిన బడ్జెట్: యూటీఎఫ్

నారాయణఖేడ్: కేంద్ర బడ్జెట్‌పై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏ మాత్రం సంతోషంగా లేరని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్ జాదవ్ పేర్కొన్నారు. ఆదాయపు పన్ను రేట్లను సవరించకుండా రాయితీలను పెంచకుండా వేతన జీవులను కేంద్రం మోసం చేసిందని మండిపడ్డారు. ఉద్యోగులపై కనికరం చూపని నిర్మలా సీతారామన్ కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

### ఫోన్ కొట్టేశాడు.. నగదు కాజేశాడు

పటాన్‌చెరు టౌన్: ఫోన్‌తో పాటు ఫోన్‌లో ఉన్న నగదు చోరీకి గురైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి(70) మంగళవారం సాయంత్రం కాలనీలో జరిగే సంతకు వెళ్లాడు. అయితే కూరగాయలు కొనే చోట అతని ఫోన్‌ని దొంగిలించారు. అతడి జీ-మెయిల్ ఆధారంగా అపరిచిత వ్యక్తి తన మూడు ఖాతాలో ఉన్న రూ.ఒక లక్ష 61 వేలు నగదును తీసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పట్టాదారు పురుషుడు.. ఫొటో మహిళది

నారాయణఖేడ్: మండలంలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన మొగులయ్య ఇటీవల మృతి చెందాడు. అతని పేరుపై ఉన్న కొంత భూమిని వారసులు తమ పేర్లపై మార్పిడి చేసుకునేందుకు ధరణి పోర్టల్‌లో స్లాట్‌బుకింగ్ కోసం శనివారం ఖేడ్‌లోని ఓ మీసేవా కేంద్రానికి వెళ్లారు. ధరణి పోర్టల్‌లో పట్టాదారు పేరు మొగులయ్యదిగా ఉన్నా.. ఫొటో మాత్రం ఓ మహిళది ఉంది. దీంతో స్లాట్‌బుక్ కాలేదు. భూమిని ఎవరికీ అమ్మక పోగా ధరణి పోర్టల్‌లో అలా ఉండి మార్పిడి చేసుకోలేని పరిస్థితి నెలకొనడంతో వారసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఖాళీ జాగా.. కనిపిస్తే పాగా!

- సంగారెడ్డిలో రెచ్చిపోతున్న కబ్జాదారులు
- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



పట్టణంలోని ఇందిరా కాలనీలో నిర్మించిన అక్రమ నిర్మాణం

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డూఅదుపు లేకుండా ఆక్రమణలు జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఓవైపు మంత్రి.. మరోవైపు కలెక్టర్ ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించేది లేదని హెచ్చరిస్తున్నా అక్రమార్కులు తగ్గడం లేదు. కొందరు మాఫియాగా తయారై యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలు చేపడతున్నారు. మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా అక్రమ నిర్మాణాలు కూల్చుతున్నా.. కొన్ని రోజులకే మళ్లీ చేపడుతున్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ నాయకుల అండదండలతో సంగారెడ్డిలో అక్రమార్కులు రెచ్చిపోయారని ఆరోపణలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వమైనా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుందని స్థానికులు ఆశ పడినా నిరాశే ఎదురవుతోంది. అక్రమార్కులు ఎదురేలేకుండా పోతోంది.

#### మంత్రి ఇలాఖాలో..

పట్టణంలోని రాజంపేట రోడ్డులో అక్రమ నిర్మాణాన్ని కూల్చాలని గత మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు నివేదిక ఇచ్చారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో కబ్జాదారులు రాత్రి వేళల్లో నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇలా సంగారెడ్డిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా జిల్లా టాస్క్ ఫోర్స్ అలసత్వం ప్రదర్శిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జాదారులను ప్రోత్సహిస్తూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా మంత్రి కల్పించుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

#### టాస్క్‌ఫోర్స్‌పై అనుమానాలు

జిల్లాలో అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా టాస్క్‌ఫోర్స్ అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో జరుగుతున్న కబ్జాలను పట్టించుకోకుండా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న కట్టడాలపై ఉక్కు పాదం మోపడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను కూల్చుతూ.. సంగారెడ్డిలో జరుగుతున్న దందాను పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముడుపులు తీసుకుని అధికారులు అటువైపు చూడటం లేదని విమర్శలు చేస్తున్నారు.

#### త్వరలో కూలుస్తాం..

మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. వాటిని వెంటనే కూల్చివేస్తాం. ఇన్ని రోజులు ఎన్నికల పనిలో నిమగ్నమై ఉండటంతో కొంత జాప్యం జరిగింది.

రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ, సంగారెడ్డి



మొక్కలకు నీరు పెడుతున్న మహిళ

# మొక్కే ప్రాణం

భూమిపై ప్రతి జీవికి గాలి ఎంతో ముఖ్యం. స్వచ్ఛమైన గాలి, వాతావరణ మార్పులకు చెట్లు ఎంతో దోహదపడతాయి. అందుకే గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసింది. రంగనాయక సాగర్ వద్ద ఏర్పాటుచేసిన నర్సరీలో వేలాది మొక్కలకు ప్రాణం పోస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. అందులో జామ, గులాబీ, నేరేడుతోపాటు వివిధ రకాల పూలమొక్కలు కూడా కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

### ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.33 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్ ఎంక్లేవ్‌కు చెందిన ఆన్‌లైన్ ట్రేడింగ్ నిర్వహించే వ్యక్తికి డిసెంబర్ 21న ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. పెట్టిన నగదుపాటు, కమీషన్ చూపిస్తూ వచ్చారు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా.. అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

# ఆరు నెలలుగా అందని బిల్లులు

- మధ్యాహ్న భోజన కార్మికుల గగ్గోలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని వేడుకోలు



చిన్నకోడూరులో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

చిన్నకోడూరు (సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్ తగ్గించడంతో పాటు పేద విద్యార్థుల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి చిన్నారుల ఆకలి తీరుస్తున్నా వారిని పట్టించుకునేనాథుడే కరువయ్యారు. ఓవైపు వడ్డీలు.. మరోవైపు భోజన నిర్వహణను భారంగా మారడంతో దిక్కుతోచని స్థితిలో మధ్యాహ్న భోజన కార్మికులు బతుకులు వెళ్లదీస్తున్న దుస్థితి నెలకొంది. సిద్దిపేట నియోజకవర్గంలో 195 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 116 ప్రాథమిక, 26 ప్రాథమికోన్నత, 53 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 10,700 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు 200 మందికి పైగా నిర్వాహకులు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి ప్రభుత్వం ప్రతి నెల రూ.1000 వేతనం చెల్లిస్తోంది. భోజనానికి అవసరమైన బిల్లులను తరగతుల వారీగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం విడుదల చేస్తోంది. కానీ.. ఆరు నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

#### నిర్వాహకులపై నిత్యావసరాల భారం

ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కోసం బియ్యం మాత్రమే అందిస్తోంది. మిగతా నిత్యావసర సరుకులను నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. 100మంది ఉన్న పాఠశాలల్లో రోజుకు రూ.750 నుంచి 1000 వరకు మధ్యాహ్న భోజన కార్మికులపై భారం పడుతోంది. నెలలో కనీసం రూ.20వేల వరకు ఖర్చును భరించాల్సి వస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఒక్కొక్కరికి రూ.50 వేల భారం పడుతోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### బిల్లుల పెండింగ్ వాస్తవమే..

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి కార్మికులకు పెండింగ్ బిల్లులు లేకుండా సకాలంలో చెల్లించేందుకు కృషి చేస్తాం.

– ఎంఈఓ దేశిరెడ్డి, చిన్నకోడూరు

#### బిల్లులు వెంటనే చెల్లించాలి



వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నాం. ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నాం. తమ గోడును వినే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నాం.

– పిల్లి తార, మధ్యాహ్న భోజన కార్మికురాలు, చిన్నకోడూరు



# అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

బొమ్మారెడ్డిగూడెంలో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సంగారెడ్డి: ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి చౌటుక్కూర్ మండలం బొమ్మరెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. జోగిపేట సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బొమ్మారెడ్డిగూడ గిరిజన తండాకు చెందిన ప్రవీణ్ (27) అదే తండాకు చెందిన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం మద్యం సేవించాడు. ఏమైందేమోగానీ తెల్లవారేసరికి తన పొలంలో శవమై కనిపించాడు. ప్రవీణ్‌ను హత్య చేశారంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దోషులను తేల్చే వరకు మృతదేహాన్ని తరలించేదిలేదని భీష్మించారు. జోగిపేట సీఐ నాగరాజు, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి వారిని సముదాయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### ట్రాక్టర్ బోల్తా: రైతు మృతి



తిరుపతిగౌడ్ (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రమాదశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. దౌల్తాబాద్ ఏఎస్ఐ సాయిలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన గడ్డమీది తిరుపతి గౌడ్(55) తన పొలంలో వరి నాట్ల వేయడం కోసం దుక్కి దున్ని బయటకు వస్తున్న క్రమంలో ఒరం గట్టు ఎక్కిస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ తిరగబడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న గ్రామానికి చెందిన కత్తుల నర్సింహులు మృతుడు కుమారుడు కిషన్‌కు ఫోన్ చేసి సమాచారం తెలిపాడు. కుటుంబ సభ్యులు వచ్చే చూసే సరికి తిరుపతి మృతి చెంది ఉన్నాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు.

### యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

మర్కూక్ (గజ్వేల్): ప్రేమించిన అమ్మాయిని దూరం చేస్తున్నారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శంకర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రవల్లి గ్రామానికి చెందిన చేవెళ్ల నర్సింహులు(20) కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన అమ్మాయి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తండ్రి ఓజాలు, బంధువు కరుణాకర్ గతంలో అతడిపై దాడి చేశారు. ఈక్రమంలో తీవ్ర మనస్తాపంతో శనివారం పొలం నుంచి ఇంటికి వెళ్తూ ప్రేమించిన అమ్మాయికి వాట్సప్ కాల్‌లో మాట్లాడుతూ తను చనిపోతున్నానని చెప్పాడు. దీంతో ఆ అమ్మాయి 100కు, మృతుడి తల్లికి ఫోన్ చేసి చెప్పింది. హుటాహుటిన తల్లి ఇంటికి వెళ్లి చూడగా ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

### పటేల్‌గూడలో చైన్‌స్నాచింగ్

పటాన్‌చెరు టౌన్: ఓ మహిళ మెడలో గొలుసు దొంగిలించిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సదా నాగరాజు కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఆర్‌కే నగర్‌కు చెందిన పావని భర్తతో కలిసి పటేల్‌గూడలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లి, తిరిగి వస్తున్నారు. పటేల్‌గూడ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు.. పావని మెడలో ఉన్న బంగారం గొలుసు లాక్కొని పరారయ్యారు. బంగారం రెండు తులాలు ఉంటుందని బాధితురాలు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

### యువకుడి అదృశ్యం



రమేష్

మిరుదొడ్డి(దుబ్బాక): యువకుడు అదృశ్యమైన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో జరిగింది. భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్ రావు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మైసిగల్ల రమేష్ (30) తన పొలంలో పండించిన కూరగాయలను విక్రయిస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ రైతుబజార్‌లో కూరగాయలను విక్రయిస్తానని జనవరి 20న వెళ్లి తిరిగి రాలేదు. రమేష్ భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# భార్య కాపురానికి రావడం లేదని..

టవరెక్కి యువకుడి హల్‌చల్



విద్యుత్ టవర్‌పై యువకుడు

కొల్చారం (నర్సాపూర్): భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు టవరెక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన శనివారం కొల్చారంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పోతిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన తండాకు చెందిన లంబాడి దేవిసింగ్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. అత్తింటి వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తమ అల్లుడు వ్యసనాలకు దూరమయ్యే వరకు తమ కూతురిని కాపురానికి పంపించేది లేదంటూ కరాఖండిగా చెప్పారు. దీంతో దేవిసింగ్ ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. ఎస్ఐ అతడిని, బంధువులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన దేవిసింగ్ సమీపంలోని విద్యుత్ టవర్ ఎక్కాడు. దీంతో పోలీసులు న్యాయం చేస్తామని చెప్పడంతో దిగాడు. అయితే గత ఏడాది నవంబర్ 13న ఇలాగే టవర్ ఎక్కడంతో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి సర్దిచెప్పి టవర్ దిగేలా చేశారు.

# తెగులు.. దిగులు

- వరి పంటకు చీడపీడల బెడద
- ఆందోళనలో అన్నదాత



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కిషన్. దుబ్బాక పట్టణానికి చెందిన రైతు. తనకున్న 6 ఎకరాల్లో వరినాటు వేశాడు. నెలరోజులు దాటుతున్నా పంట పచ్చపడకపోవడంతో పాటు ఎదుగుదల లోపించింది. రెండు సార్లు దుక్కిమందు, యూరియా, సల్ఫర్, పోటాష్ చల్లినా లాభం లేదు. వరి చేలుకు తెగులు సోకి ఎర్రబడుతుండడంతో ఆందోళన చెందుతున్నాడు. వానాకాలంలో సైతం పంట దిగుబడి సరిగా రాక పెట్టుబడి మీద పడిందని గోడు వెల్లబోసుకున్నాడు. ఇది ఒక్క రైతు కిషన్‌దే కాదు జిల్లాలోని అందరి రైతుల పరిస్థితి.

దుబ్బాకటౌన్: జిల్లాలో చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరుండడంతో యాసంగిలో 3.46 లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటివరకు 2.47 లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. అయితే వరి పంటలపై మొగిపురుగు (కాండం తొలిచే పురుగు) దాడి చేస్తోంది. దీంతో పంట ఎదుగుదల లోపించి పసుపు పచ్చగా మారి కుళ్లిపోతోంది. దీంతో రైతులు రకరకాల మందులు, గులికలు చల్లుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు ఏ మందు ఇస్తే ఆ మందు తెచ్చి పిచికారీ చేస్తున్నారు. ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

#### వాతావరణ పరిస్థితులే కారణం..

వరి పంటలు కుళ్లిపోయి దెబ్బతినడానికి మొగిపురుగు కారణమని తెలుస్తోంది. ఉధృతి బాగా ఉండడంతో పాటు ఎదుగుదల లేకపోవడానికి వాతావరణ పరిస్థితులే కారణమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో వరి పంటలను డాట్ సెంటర్ శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయాధికారులు పరిశీలిస్తున్నారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు.

#### ఇవీ సూచనలు

- రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువ ఉండడంతో కూడా వరి చేలు ఎర్రబడి, కుళ్లిపోయినట్లు అవుతున్నాయి.
- వర్షాకాలంలో పొలాల్లో నీరు బాగా నిలిచి భూమి ఆరకపోవడంతో పాటు మళ్లీ వరి వేయడంతో వేరు వ్యవస్థ కుళ్లిపోతు ఎదుగుదల లోపిస్తోంది.
- రైతులు పొలాల్లో ఎక్కువ నీరు నిల్వ ఉంచకుండా పంటను ఆరబెడుతూ నీరు పెట్టాలి.
- ఇష్టం వచ్చిన మందులు చల్లొద్దు. ఎండతీవ్రత పెరిగితే యథావిధిగా పంటలు కోలుకుంటాయి.
- ఫర్టిలైజర్ల డీలర్లు రైతులకు ఏ మందులు పడితే అవి ఇవ్వవద్దని తాము సూచించిన మందులే అధికారులు సూచించారు.
- రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకే మందులు పిచికారీ చేసుకోవాలి. లేకుంటే పంటకు ఫలితం ఇవ్వకపోవడమే కాకుండా ఆర్థికంగా నష్టం ఏర్పడుతుంది.



తెగులు సోకిన వరి పంట

#### అవగాహన కల్పిస్తున్నాం



వరి పంటలపై మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. నాటేసిన వరి పైరు కాండంను తినడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. గ్రామాల్లో తిరుగుతూ పంటలను పరిశీలిస్తున్నాం. మొగిపురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎండలు ముదిరితే మళ్లీ పంటలు బాగవుతాయి. రైతులు ఆందోళన చెందొద్దు. యూరియ తక్కువ మోతాదులో చల్లుకోవాలి.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి